క్లుప్తంగా

విద్యాసామగ్రి పంపిణీ



చిలకలూరిపేట: నిరుపేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని గుంటూరుకు చెందిన చార్టర్డ్ ఎకౌంటెంట్ దామచర్ల శ్రీనివాసరావు చెప్పారు. పసుమర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు డీఎస్ఆర్ మిత్ర మండలి, కావూరు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్ల వంటి విద్యాసామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభగల విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించాల్సిన సామాజిక బాధ్యత ప్రతిఒక్కరూ గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమణబాబు, స్కూల్ హెచ్ఎం ఎస్కెఎండీ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే నగరోదయం



వినుకొండ టౌన్: వార్డులలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నగరోదయం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు పట్టణంలోని 7, 8, 9 వార్డులలో శుక్రవారం నగరోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ వార్డులలో ఉన్న ప్రజల వద్ద నుండి ఈ కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్య, ఓటర్, ఆధార్ కార్డుల సమస్యలపై అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఆయా వార్డులోని అంగన్‌వాడి కేంద్రాలను సందర్శించి, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారాన్ని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

గాలికుంటు టీకా వేయించాలి

శావల్యాపురం: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా స్థానిక పశువైద్యశాల్లో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమంపై పాడి పోషకులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు శావల్యాపురం సెక్టారు పశువైద్యాధికారి రావెళ్ళ సురేష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ పశువుల్లో గాలికుంటు వ్యాధి టీకాల వలన కలిగే ప్రయోజనాలు వివరించుతూ వ్యాధి సోకిన పాడిపశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చునన్నారు. దూడల్లో మరణాలు తగ్గించి ఆరోగ్యంగా ఎదగడానికి దోహదపడుతుందన్నారు. పశువుల గుర్తింపునకు చెవిపోగు వేయటం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు లబ్ధిచేకూరతాయన్నారు. 4 నెలల దాటికి ప్రతి పశువుకు తప్పనిసరిగా గాలికుంటు టీకా తప్పనిసరిగా చేయించాలన్నారు. వ్యాధి లక్షణాలు తీవ్రమైన జ్వరం, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవటం, ఎద్దులలో పనిసామర్థ్యం తగ్గుతాయన్నారు. వ్యాధి వలన కలిగే నష్టాలు గురించి మాట్లాడుతూ పాల ఉత్పత్తి పనిసామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. పాలు తాగే దూడలలో మరణాలు సంభవిస్తాయన్నారు. వీటిని నివారణ గాలికుంటు టీకా ద్వారానే సాధ్యమన్నారు. మండలంలోని అన్నీ గ్రామాల్లో సూమారు 16 వేల పశువులు ఉన్నాయని వచ్చే నెల 24 వరకు ప్రభుత్వ పరంగా పశువులకు గాలికుంటు టీకా కార్యక్రమం జరుగుతాయన్నారు. ఆయనతో పాటు వెటన్నరీ ఆసిస్టింట్ యం.బుల్లెయ్య ఉన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై శిక్షణ



రొంపిచర్ల: మండలంలోని తుంగపాడు పవర్ గ్రిడ్ ఆవరణలో రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పవర్ గ్రిడ్ ఉద్యోగులకు ప్రథమ చికిత్సపై శుక్రవారం శిక్షణ నిర్వహించామని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంజుల జగన్‌మోహన్ రెడ్డి తెలి పారు. శిక్షణకు వేద హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నవులూరి క్రాంతి కుమార్ రెడ్డి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. డాక్టర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ సరైన సమయంలో సరైన విధానంలో ప్రథమ చికిత్స అందజేయడం ద్వారా ప్రాణా న్ని మనం కాపాడవచ్చొన్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా యుక్త వయస్సులో ఉన్న వారు కూడా గుండెపోటుకు గురవుతున్నారన్నారు. మరణాలు తగ్గించేందుకు వారిని వైద్యశాలకు తరలించే లోపు చేయవలసిన ప్రథమ చికిత్స గురించి సీపీఆర్ చేసే విధానం, మెళుకువలను తెలియజేశారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి, పాము కాటుకు, అగ్ని ప్రమాదాలకు, విద్యుత్ ఘాతానికి, వడదెబ్బకు గురైన వారికి ఏవిధంగా ప్రథమ చికిత్స అందించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పవర్ గ్రిడ్ డీజీఎం రమేష్‌రెడ్డి, డెప్యూటీ మేనేజర్ నాగభూషణం, చీఫ్ మేనేజర్ సుబ్బారావు, రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెల్లటూరులో గ్రామోదయం

- బడిమానేసిన 10 మంది విద్యార్థుల గుర్తింపు
- ఒప్పించి.. పాఠశాలలో చేర్పించిన యంత్రాంగం



గ్రామంలో బడి మానేసిన చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు విద్యాప్రాముఖ్యత గురించి వివరిస్తున్న అధికారులు

బొల్లాపల్లి: గ్రామోదయంలో భాగంగా మండలంలోని వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌లో పల్లె నిద్ర నిర్వహించారు. అనంతరం శుక్రవారం ఉదయం స్థానిక అధికారుల ఆధ్వర్యంలో గ్రామంలోని చెంచు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలను తనిఖీ చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద క్లాప్ మిత్రలతో కలిసి కాఫీ సేవించి ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రభుత్వ పథకాల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో పార్వతి మాట్లాడుతూ నాడు–నేడులో పాఠశాలల్లో చేపట్టిన పనులను తనిఖీ చేసి నాణ్యతాప్రమాణాలను పాటించాలన్నారు. బడిమానేసిన విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించామని తెలిపారు.

గ్రామంలో 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 10 మంది విద్యార్థులను గుర్తించామని వీరి తల్లిదండ్రులకు విద్యాప్రాముఖ్యత గురించి వివరించి తిరిగి పాఠశాలల్లో చేర్పించామన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు కృషి చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత నివారణ చర్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగ పరచుకోవాలన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వద్ద క్లాప్ మిత్రలతో కలిసి కాఫీ సేవించి వారి సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.చిన వీరయ్య, పీఆర్ ఏఈ షేక్ అల్లాభక్షు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మజారాణి, పంచాయతీ కార్యదర్శి వి.ధనలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కీలకపాత్ర పోషించాలి



శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న మండల స్థాయి అధికారులు

శావల్యాపురం: ప్రభుత్వ పథకాల అమలు తీరులో అధికారుల కీలకపాత్ర పోషించాలని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. శుక్రవారం మండలంలోని మతుకుమల్లి గ్రామసచివాలయాన్ని, గ్రామంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, నాడు–నేడు మన పథకంలో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జరుగుతున్న పనులను మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అధిగమించటానికి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో తమ విధులు అంకిత భావంతో నిర్వహించాలన్నారు. ముఖ్యంగా గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారిధిగా ఉంటూ అర్హత కల్గిన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం గ్రామంలో జగనన్న స్వచ్ఛ సంకల్పం అమలు తీరుపై శానిటేషన్ సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ యలగాల బసవయ్య, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, మండల వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్, సూపర్‌వైజర్లు కుప్పం శ్రీలత, సాయిగీతా, ఏఈ మూఢవత్ ఆకాష్, పంచాయతీ కార్యదర్శి ముంద్రు మనోహర్ పాల్గొన్నారు.

రక్తహీనత తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలి



రూత్‌డైక్‌మెన్ కాలనీలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ గోవిందరావు

చిలకలూరిపేట: రక్తహీనత తలెత్తకుండా తగు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని రూత్‌డైక్‌మెన్ కాలనీలో నగరోదయం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ రఫాని మాట్లాడుతూ ఎనీమియాతో బాధపడే గర్భిణులు, ఐదు సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించటం ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేక పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన వైద్య సహాయం, పౌష్టికాహార పంపిణీ నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఎస్‌డీజీ (సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్)లో భాగంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, వైద్యులు నిరంతర పర్యవేక్షణ చేసేలా సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. వీటితో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గర్భిణులు, ఐదు సంవత్సరాల లోపు పిల్లలను ఇంటింటికీ తిరిగి గుర్తించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస దీక్షలు చేపట్టాలి



ఖర్జూర పండ్ల బస్తాలు పంపిణీ చేస్తున్న హుదా సొసైటీ సభ్యులు

చిలకలూరిపేట: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నియమ నిబంధనలతో కూడిన ఉపవాస దీక్షలు చేపట్టడంతో పాటు దానగుణం చాటుకోవాలని హుదా సొసైటీ అధ్యక్షుడు మౌలానా మొహమ్మద్ అబ్బాస్‌ఖాన్ నద్వీ చెప్పారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఇఫ్తార్ తదితర కార్యక్రమాల నిర్వహణకు హుదా సొసైటీ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని మసీదులకు రూ. 20వేలు నగదు, ఖర్జూర పండ్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడిచేందుకు ప్రయత్నించి దేవుడి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ ఇఫ్తార్, మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ. 5 లక్షలు నియోజకవర్గ పరిధిలోని మసీదులకు అందజేయటం హుదా సొసైటీ చేస్తున్న దార్మిక కార్యక్రమాల్లో ఒక భాగమని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, మాజీ కౌన్సిలర్ సయ్యద్ బషీర్ మేస్త్రి తదితర పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించండి

వినుకొండ టౌన్: విద్యుత్ వినియోగదారులకు అందచేసిన విద్యుత్ బిల్లులను ఇచ్చిన 30 రోజులలోపు చెల్లించాలని, లేనిపక్షంలో 15 రోజులలో ఎటువంటి నోటీసులు లేకుండా సర్వీసు తొలగించబడుతుందని ఏఈ రవితేజ పేర్కొన్నారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇంట్లో 2వ ఫ్లోర్, 3వ ఫ్లోర్‌లలో ఉన్నటువంటి విద్యుత్ మీటర్లను గ్రౌండ్ ఫ్లోర్‌కు మార్చుకోవాలని విద్యుత్ వినియోగదారులకు సూచించారు.అంతేకాకుండా ఒకే ఇంట్లో 2 విద్యుత్ మీటర్లు ఉండరాదని, అట్లు ఉన్నటైతే వినియోగదారులు స్వచ్ఛందంగా అదనపు మీటర్ను తిరిగి అప్పగించాలన్నారు. మీటరు కావలసిన పక్షంలో పాత మీటరు ఇవ్వబడదని, తిరిగి కొత్త మీటరుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు విరుద్ధంగా విద్యుత్ వినియోగించుకున్నట్లయితే వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవడమేకాకుండా భారీ పెనాల్టీలు విధించడం జరుగుతుందన్నారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

ఈపూరు: మండలంలోని కొచ్చర్ల గ్రామంలో గల గ్రామ సచివాలయంలో ఎఫర్ట్ సహకారంతో ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ కోపెల దేవరాజ్ పాల్గొని మాట్లాడుతూ జలాల ప్రాముఖ్యతను వివరించారు. నీటి ఎలా పొదుపు చేసుకోవాలని, భూగర్భజలాలు ఎలా పెంపొందించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ నాగేంద్రబాబు, వీఆర్వో శ్యామేల్, ఎఫర్ట్ సంస్థ కమ్యూనిటీ మొబలైజర్ ఎఫ్రాయిమ్, ఏపీఎం, సీసీలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది ఎఫర్ట్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

250 మందికి కళ్లజోళ్లు పంపిణీ



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా

నాదెండ్ల: విద్య, వైద్య రంగాల్లో ప్రజలకు విశిష్టమైన సేవలందిస్తున్న జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా అభినందనీయుడని మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నాయకుడు నాయుడు వాసు చెప్పారు. మండలంలోని సంకురాత్రిపాడు గ్రామంలో 250 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ నెల 12వ తేదీన మ్యాక్సీ విజన్, శ్రీఐకేర్ సౌజన్యంతో జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు కంటి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ జాన్‌సైదా మాట్లాడుతూ, చిలకలూరిపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించి మందులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వైసీపీ మాజీ మండల అధ్యక్షుడు గొంటు శ్రీనివాసరెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, కొక్కెర చిట్టిబాబు, బిళ్ళా శివయ్య, మానుకొండ శేషిరెడ్డి, మోజేష్, కరీం, జిలానీ, ఇమ్రాన్, భార్గవ్, లాలూ పాల్గొన్నారు.

ర్యాంపు మధ్యలో గ్రిల్ ఏర్పాటు చేసుకోండి

ప్రజలకు విజ్ఞప్తి చేసిన మున్సిపల్ కమిషనర్



31వ వార్డులో ఒక ఇంటి ముందు మురుగుకాలవలోని పూడిక పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నరసరావుపేట: పట్టణ ప్రజలు తమ ఇంటి నుంచి రోడ్డుపైకి వచ్చేందుకు ఏర్పాటు చేసుకొనే ర్యాంపుల మధ్యలో గ్రిల్ ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు సూచించారు. దీని వలన ర్యాంపు కిందనున్న మురుగుకాలువలోని పూడిక తీయటం సులభంగా ఉంటుందన్నారు. లేని పక్షంలో పూడిక పేరుకుపోయి నీరు ముందుకు కదలక దోమలు వృద్ధి చెందుతాయన్నారు. శుక్రవారం ఉదయం అధికారులు, సిబ్బందితో కలిసి 31 వార్డులోని మహాలక్ష్మినగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ వార్డు ప్రజలను శానిటేషన్, మంచినీటికి సంబంధించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆ ప్రాంతంలో చేస్తున్నటువంటి కాలువలలో పూడిక తీసే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఇ ఓలేటి శ్రీనివాసరావు, 31వార్డ్ ఇంచార్జి మీరావలి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు రాములు నాయక్, సువర్ణరాజు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రామకోటయ్య, వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

శావల్యాపురం: నియోజకవర్గంలోని నూజెండ్ల, వినుకొండ పట్టణం, శావల్యాపురం మండలాల్లో నూతన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పోస్టులు భర్తీకి ప్రభుత్వపరంగా నోటిఫికేషన్ జారీ చేసినట్లు సీడీపీవో ముదివర్తి అనురాధ శుక్రవారం తెలిపారు. శావల్యాపురం మండలంలోని వేల్పూరు గ్రామం ఓసీ సెంటరు–1 అంగన్‌వాడీ కార్యకర్త కోసం దరఖాస్తు చేసు కోవాలన్నారు. నూజెండ్ల మండలంలోని పాతజడ్డావారిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో భూమాయపాలెంలో (ఓసీ) నూజెండ్ల–2, (ఎస్టీ) మారెళ్లవారిపాలెం–01 (ఒపెన్ కేటగిరి జనరల్) పాతచెరువు కొమ్ముృవారిపాలెం గ్రామపంచాయతీ రెడ్డికొత్తూరు (ఒపెన్ కేటగిరి జనరల్) పువ్వాడ గ్రామపంచాయతీ పరిధిలో కొండరాయునిపాలెం –02 (ఒపెన్ కేటగిరి జనరల్) అంగన్‌వాడి సహాయకులు పోస్టులకు అర్హత కలిగిన లబ్ధిదారులు దరఖాస్తులు చేసు కో వాలన్నారు. వినుకొండ మున్సిపాలిటీ 15వ వార్డు కుమ్మరి బజారు, (ఓపెన్ కేటగిరి జనరల్) 27వార్డు కిష్టియన్‌పాలెం ఎస్సీ కేటగిరి లబ్ధిదారులు మాత్రమే అర్హత పొందుతారన్నారు. ఆమెతో పాటు సూపర్‌వైజర్లు కుప్పం శ్రీలత, గుర్రం శేష కుమారిలు పాల్గొన్నారు.

ఏ సమస్య ఎదురైనా అండగా ఉంటా

- ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే గోపిరెడ్డి అభయం
- ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మక్కా మసీదులో ప్రార్థనలు



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పవిత్ర రంజాన్‌మాసం ప్రారంభమైన సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మక్కా మసీదులో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు నిర్మాణానికి, అభివృద్ధికి తోడ్పాటు అందించిన ఎమ్మెల్యే గోపిరెడ్డిని ముస్లిం కమిటీ పెద్దల ఆహ్వానం మేరకు రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా మసీదులో ముస్లింలు చేపట్టిన ఉపవాస దీక్ష, ప్రత్యేక ప్రార్థన, ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం చేపడుతున్న ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మసీదుకు 84 ఏళ్ల చరిత్ర ఉన్నట్లు మసీదు పెద్దల ద్వారా తెలిసిందన్నారు. మసీదులోకి డ్రెయినేజీ నీరు లోపలికి రాకుండా చేశామన్నారు. మసీదు ఖాళీ చేయమని ఆర్టీసీ అధికారులు నోటీసులు ఇచ్చారనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా ముస్లిం సోదరులకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్.ఏ.హనీఫ్, వైఎస్సార్‌సీపీ మూడు జిల్లాల ఎస్టీ విభాగ ఇన్‌చార్జి పాలపర్తి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు మాగులూరి రమణారెడ్డి, షేక్ రెహమాన్, కారుమంచి మీరావలి, షేక్ కరిముల్లా, పలువురు ముస్లిం నాయకులు, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఐదుగురు ఎంపిక



ఇట్టే హేమంత్ కుమార్ | ఎం. లక్ష్మీ శ్రీకాంత్ | ఆర్. భవ్యశ్రీ | కల్లి శ్రీవిద్య | ఎ. భార్గవ సాయిలక్ష్మి

రొంపిచర్ల: ఈ ఏడాది నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం షేక్ మొహిద్దీన్ సాహెబ్ శుక్రవారం తెలిపారు. కల్లి శ్రీవిద్య 129 మార్కులు సాధించగా, ఇట్టే హేమంత్ కుమార్ 119 మార్కులు, ఎం. లక్ష్మీ శ్రీకాంత్ 106 మార్కులు, ఎ.భార్గవ సాయిలక్ష్మి 101 మార్కులు, ఆర్. భవ్యశ్రీ 100 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. ఎన్ఎంఎంఎస్ ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

క్షయవ్యాధి నివారణ దినోత్సవం



రొంపిచర్లలో ర్యాలీగా వస్తున్న విద్యార్థులు, వైద్యాధికారులు



శావల్యాపురం సదస్సులో పాల్గొని మాట్లాడుతున్న వైద్యాధికారి ఇబ్రహీం

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మర్రిచెట్టుపాలెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రేవతిబాయి మాట్లాడుతూ క్షయ వ్యాధి ప్రమాదకరమైన వ్యాధి అయినప్పటికీ పూర్తిస్థాయిలో చికిత్స, మందులు ఉన్నాయన్నారు. క్షయ వ్యాధికి ప్రభుత్వమే ఉచితంగా వైద్యం, మందులు అందజేస్తుందన్నారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యం, మందులు అందుబాటులో ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ కె. అబ్దుల్ రెహమాన్, ఎంపీహెచ్ఈవో పి. శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ సుజాత కుమారి, హెల్త్ అసిస్టెంట్ షేక్ కరిముల్లా, ప్రధానోపాధ్యాయులు అప్పారావు, ఉపాధ్యాయుల సత్యనారాయణ పాల్గొన్నారు.

వినుకొండ టౌన్: టీబీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, రెండు వారాలకు మించి దగ్గు, కఫంతో రక్తం పడుట, జ్వరం లక్షణాలు ఉంటే తప్పని సరిగా పరీక్షలు చేయించుకుని, తగు మందులు తీసుకోవాలని వైద్యులు ఎస్.బుచ్చిబాబు పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఒకటవ వార్డు బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది సంయుక్తంగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రజాక్, నరేష్, టీబి యూనిట్ సూపర్‌వైజర్, సిబ్బంది ఎస్‌కె సుభాని, రాజేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

శావల్యాపురం: జాతీయ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం శుక్రవారం తెలిపారు. మండలంలోని ఇర్లపాడు గ్రామంలో జరిగిన సదస్సులో వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం పాల్గొని మాట్లాడుతూ క్షయ వ్యాధి మైక్రో బ్యాక్టీరియా ట్యూబర్ కోలోసిస్ వైరస్ ద్వారా సోకుతుందన్నారు. క్షయ వ్యాధి అంటు వ్యాధి అన్నారు. మద్యం అతిగా సేవించే వారికి, షుగర్ వ్యాధి పోగ తాగేవారికి మురికివాడల్లో నివాసాలు ఉండే వారందరు ఈవ్యాధి బారిన పడే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. రెండు వారాల పాటు దగ్గు, జ్వరం లక్షణాలు ఉంటే తక్షణమే వైద్య పరీక్షలు చేయించాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందన్నారు. క్షయ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే సత్వరమే వైద్యసేవలు అందిస్తే ప్రాణాపాయం నుంచి విముక్తి పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పి సంకీర్తన రాణి, ఆరోగ్య కార్యకర్త విజయలక్ష్మి, ఆశ కార్యకర్త మరియమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం ఎస్‌కే ఫౌండ్రీ వద్ద వాహనం అదుపుతప్పటంతో వ్యక్తి తీవ్ర గాయాలపాలై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. 108 ఈఎంటీ శోభన్‌బాబు, పైలట్ శివనాగం ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు చిలకలూరిపేట రూత్‌డైక్‌మెన్ కాలనీకి చెందిన దంపతులు నాగిపోగు ఆంజనేయులు, కుమారిలు యడ్లపాడు మండలం కారుచోల గ్రామానికి ఓ ఫంక్షన్‌కు వెళ్ళి తిరిగి వస్తున్నారు. గణపవరం ఎస్‌కే ఫౌండ్రీ వద్దకు వచ్చే సరికి వాహనం అదుపుతప్పి క్రిందపడటంతో ఆంజనేయులు తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకున్న 108 వాహనం క్షతగాత్రుడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

ఈపూరులో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీల చింపివేత

8 మంది టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో వైఎస్సార్ సీపీ వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపివేసిన ఘటనలో 8మంది టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు. గురువారం రాత్రి ఈపూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు 8మంది ఫుల్‌గా మద్యం సేవించి ప్రధానకూడళ్లలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను బ్లేడ్‌లతో కోసివేశారని, కోసివేసిన దృశ్యాలు సీసీ కెమెరా పుటేజ్‌లో నమోదైనట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అనంతరం వివాదాలు సృష్టించేందుకు టీడీపీకి చెందిన ఫ్లెక్సీలను వారే బ్లేడ్‌లతో కోసివేసినట్లు, అదీ కూడా సీసీ కెమెరాలో నమోదైనట్లు పేర్కొన్నారు. ఈపూరు వైఎస్సార్ సీపీ నాయకుల ఫిర్యాదు మేరకు 8 మందిపై కేసు నమోదు చేసి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఆయన తెలిపారు. ఎటువంటి రాజకీయ గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉన్న ఈపూరును అల్లర్లు సృష్టించడానికే టీడీపీ నాయకులు ఎత్తుగడలు వేస్తున్నారని, ఇలాంటి వేషాలు మానుకోకపోతే తగిన రీతిలో బుద్ధిచెబుతామని వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు.

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలి

నాదెండ్ల: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు సక్రమంగా సరఫరా చేసి వారి ఆరోగ్య వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ ఆదేశించారు. కనపర్రు గ్రామంలో శుక్రవారం కాఫీ విత్ క్లాప్ మిత్రా కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో కాఫీ తాగుతూ వారి సమస్యలు, పారిశుద్ధ్యం నిర్వహణ తదితర వివరాలపై చర్చించారు.